సాక్షి
విశాఖపట్నం

మంగళవారం । 20 । ఫిబ్రవరి । 2024

విన్యాసం.. సంభ్రమాశ్చర్యం

8లో





పటిష్టంగా మ్యూజియం నిర్వహణ

విశాఖ మ్యూజియం నిర్వహణ పటిష్టంగా చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. 8లో

న్యూస్‌రీల్

రేపు శ్రీశారదా పీఠానికి సీఎం వైఎస్ జగన్



ఏర్పాట్లపై స్వాత్మానందేంద్రతో చర్చిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, కమిషనర్ సాయికాంత్

పెందుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం విశాఖ శ్రీశారదా పీఠాన్ని సందర్శించనున్నారు. గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో 11.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో చినముషిడివాడలోని శ్రీశారదా పీఠానికి 11.40 గంటలకు వస్తారు. పీఠంలో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీలతో కలిసి పీఠంలోని దేవతామూర్తులకు సీఎం జగన్ ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం 12.55కి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని గన్నవరం బయలుదేరుతారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చినముషివాడలోని శారదా పీఠాన్ని కలెక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్‌వర్మ సోమవారం రాత్రి సందర్శించారు. స్వామీజీల ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం సీఎం పర్యటన ఏర్పాట్లపై స్వాత్మానందేంద్రతో కలిసి సమీక్షించారు.

పోలీస్ విభాగ భవనాలు ప్రారంభం



సీపీ రవిశంకర్ సమక్షంలో హ్యాపీ హోమ్స్ ప్రారంభించిన ఆర్ఐ(క్యూఎం) పి.వెంకటేశం

విశాఖ సిటీ: నగర ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆవరణలో పునర్నిర్మించిన డాగ్ స్క్వాడ్, పోలీస్ హ్యాపీ హోమ్స్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ సమక్షంలో ఆయా విభాగాల ఆర్ఐల మీదుగా ప్రారంభించారు. సీపీ ఇటీవల పోలీస్ శాఖకు చెందిన అన్ని విభాగాల భవనాలను సందర్శించారు. అందులో డాగ్‌స్క్వాడ్, పోలీస్ సిబ్బంది డార్మిటరీలను మరింత ఆధునీకరించాలని గుర్తించారు. వాటిని ఆధునీకరించి సోమవారం పోలీస్ డాగ్ స్క్వాడ్ భవనాన్ని ఆర్ఐ(సీఎస్‌బీ) కె.రవికుమార్, పోలీస్ హ్యాపీ హోమ్స్‌ను ఆర్ఐ(క్యూఎం) పి.వెంకటేశం ప్రారంభించారు. జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ-1 వి.ఎన్.మణికంఠ, డీసీపీ(క్రైమ్) పి.వెంకటరత్నం, ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ(ఎస్‌బీ) ఎస్.వెంకటరావు, ఏడీసీపీ(ఏఆర్) బి.నారాయణరావు, దిశా ఏసీపీ వివేకానంద, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో కార్పొరేటర్ ఉషశ్రీ ప్రతిభ



పతకాలతో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ

సీతంపేట: బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో జీవీఎంసీ 43వ వార్డు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ మూడు బంగారు పతకాలు గెలుపొందారు. ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 18 వరకు రాజమండ్రిలో ఈ పోటీలు జరిగాయి. 40 ప్లస్ మహిళల కేటగిరీలో అద్భుతమైన ప్రతిభతో రాణించి సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో ఉషశ్రీ బంగారు పతకాలు సాధించారు. ఈ విజయాలతో మార్చిలో హర్యానాలోని పంచకులలో జరగనున్న జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనేందుకు ఏపీ తరఫున అర్హత సాధించారు. ఈ సందర్భంగా బంధువులు, స్నేహితులు, పార్టీ నాయకులు ఆమెను అభినందించారు.

'మిలాన్' ఏర్పాట్లపై నిరంతరం పర్యవేక్షణ

కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశం

డాబాగార్డెన్స్: మిలాన్-2024 కార్యక్రమాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలిసి సోమవారం బీచ్‌రోడ్డులో మిలాన్-2024 ఏర్పాట్లపై సమీక్షించారు. ముందుగా విశ్వప్రియ ఫంక్షన్ హాల్ నుంచి నోవాటెల్ పరిసర ప్రాంతాల వరకు, మిలాన్ ప్రధాన వేదిక వద్ద ఏర్పాట్లు, సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన గ్యాలరీలను పరిశీలించారు. బీచ్‌లోని సోలార్ లైట్లు, సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. వీక్షకుల కోసం పలు చోట్ల ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు. సర్వీస్ రోడ్డులోని దుకాణాలను తాత్కాలికంగా తొలగించాలని ఆదేశించారు.

ఐఐఎంవీ నూతన శకం

విశాఖలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) శాశ్వత క్యాంపస్ మంగళవారం ప్రారంభం కానుంది. 241.50 ఎకరాల్లో అడుగడుగునా అద్భుతమనేలా గ్రీన్ బిల్డింగ్ నిర్మాణ శైలి, స్మార్ట్ టెక్నాలజీతో రూపుదిద్దుకున్న క్యాంపస్‌ను ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి స్మృతి ఇరానీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఢిల్లీకి చెందిన ఆర్కిటెక్చర్ సంస్థ రూపొందించిన డిజైన్‌తో రెండు దశల్లో క్యాంపస్‌ను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. తొలిదశలో రూ.472 కోట్లతో నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

– సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం



గంభీరంలో నిర్మించిన ఐఐఎం విశాఖపట్నం క్యాంపస్

- అడుగడుగునా అద్భుతంగా.. హార్వర్డ్‌ను మించేలా నిర్మాణం
- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ, సీఎం జగన్



ఐఐఎంవీ - ముఖ్యాంశాలు

- 241.5 ఎకరాలను ఉచితంగా అందించిన రాష్ట్ర ప్రభుత్వం
- స్మార్ట్‌గా హరిత భవన నిర్మాణాలు
- రెండు దశల్లో రూ.807 కోట్లతో నిర్మాణానికి ప్రణాళికలు
- తొలిదశలో రూ.472 కోట్లతో భవనాలు, మౌలిక సౌకర్యాలు పూర్తి
- హార్వర్డ్ విశ్వవిద్యాలయాన్ని మించే సాంకేతికతతో సొబగులు
- 1,500 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు
- 7,200 పూల, ఫల, వృక్షజాతుల పెంపకం
- వాన నీటి సంరక్షణ చర్యలతో క్యాంపస్ నిర్మాణం

రాష్ట్ర విభజన బిల్లులో పొందుపరిచిన కేంద్ర విద్యా సంస్థల్లో ఒకటి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) విశాఖపట్నం. 2015 నుంచి ఆంధ్ర విశ్వ విద్యాలయంలో తాత్కాలికంగా కార్యకలాపాలు ప్రారంభం కాగా.. తక్కువ కాలంలోనే విద్యా రంగంలో తనదైన ముద్ర వేసింది. ఐఐఎం క్యాంపస్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆనందపురం-గంభీరం పరిసర ప్రాంతాల్లో 241.50 ఎకరాలను ఉచితంగా కేటాయించింది.

ఈ స్థలంలో రెండు దశల్లో క్యాంపస్ నిర్మాణం ప్రారంభించారు. ఫస్ట్ ఫేజ్‌లో రూ.472.61కోట్లతో భవనాలు, మౌలిక వసతుల పనులను పూర్తి చేశారు. మొత్తం 62,350 చదరపు మీటర్ల విస్తీర్ణంలో బిల్టప్ ఏరియాను అభివృద్ధి చేశారు. ఆర్కాప్ అసోసియేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే ఢిల్లీ సంస్థ ఈ బిజినెస్ స్కూల్ ప్లాన్ రూపొందించింది. ప్రపంచ ప్రసిద్ధ హార్వర్డ్ విశ్వవిద్యాలయాన్ని మించేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇక్కడ నిర్మాణాల్లో మిళితం చేయడం విశేషం.



విద్యార్థులకు జిమ్ సౌకర్యం

గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్‌తో నిర్మాణం

పర్యావరణహిత భవనంగా ఐఐఎం క్యాంపస్‌ను తీర్చిదిద్దారు. పరిసరాల్లో ఉన్న ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకుంటూ.. అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తూ భవనాలను నిర్మించారు. దేశంలోనే ప్రత్యేకంగా నిలిచేలా జాతీయ రహదారి నుంచి క్యాంపస్ వరకు, క్యాంపస్ చుట్టూ 7,200 వివిధ రకాల చెట్లు, మొక్కలు నాటారు. ఈ స్థలం కొండల మధ్య ఉండటంతో.. నీటి వనరులు పుష్కలంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో వాన నీటిని ఒడిసి పట్టేలా జల సంరక్షణ చర్యలు చేపట్టారు.

అత్యున్నత ప్రమాణాలతో క్యాంపస్ సిద్ధం



గ్రీన్ రేటింగ్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హ్యాబిటేట్ అసెస్మెంట్(గృహ) సిస్టం ద్వారా 5 స్టార్ రేటింగ్ సొంతం చేసుకునేలా ఐఐఎం విశాఖపట్నం కొత్త క్యాంపస్ నిర్మాణం తొలిదశ పూర్తయింది. రెండు ఫేజ్‌లలో మొత్తం రూ.807.69కోట్లతో క్యాంపస్‌ను నిర్మిస్తున్నాం. మొత్తం 1,170 మంది విద్యార్థులకు సరిపడా నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా.. మొదటి దశలో 600 మందికి వీలుగా అన్ని భవనాలు పూర్తయ్యాయి. పర్యావరణానికి అనుకూలమైన నిర్మాణ ప్రమాణాలకు అనుగుణంగా పచ్చదనం అభివృద్ధి చేశాం.

– ప్రొ.ఎం.చంద్రశేఖర్, ఐఐఎం, విశాఖపట్నం డైరెక్టర్

విభిన్న ప్రత్యేకతల సమాహారం

- క్యాంపస్‌లో అవసరాలకు కావాల్సిన దానికంటే అధికంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా 1,500 కిలోవాట్ల సామర్థ్యంతో ప్లాంట్‌ను నిర్మించారు. ఈ ప్లాంట్ ద్వారా ఏడాదికి 22.59 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది.
- కోవిడ్‌లో ఎదురైన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తగిన చర్యలు చేపట్టారు. ఇక్కడ ఏర్పాటు చేసిన పరికరాలను వినియోగించడానికి చేతులతో స్విచ్‌లు నొక్కే పరిస్థితి లేకుండా.. సెన్సార్ల ఆధారంగా పనిచేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.
- హార్వర్డ్ విశ్వవిద్యాలయ నమూనాను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు 'యు'ఆకారంలో కూర్చొనేలా తరగతి గదులు నిర్మించారు. 50 మంది, వంద మంది కూర్చొనేలా ఏసీ క్లాస్ రూంలు సిద్ధమయ్యాయి.
- వంద సీట్లు ఉన్న 10 క్లాస్ రూమ్‌లు, 50 సీట్లున్న క్లాస్‌రూమ్‌లు 10 నిర్మించారు. వీటికి అదనంగా మరో 5 తరగతి గదులు నిర్మించారు. ప్రొఫెసర్లకు 117 రూమ్స్ అవసరం కాగా.. ఇప్పటికే సగానికి పైగా పూర్తయ్యాయి.
- ప్రత్యేక తరగతులు చెప్పేందుకు దేశవిదేశాల నుంచి వచ్చే ప్రముఖులకు 60 గదులతో కూడిన ఫైవ్‌స్టార్ హోటల్ పోలిన అతిథిగృహం ఏర్పాటు చేశారు.
- ప్రొఫెసర్లు పాఠాలు మొదలు పెట్టిన వెంటనే అత్యాధునిక సెన్సార్లు గ్రహించి.. స్పీకర్లు వాటంతట అవే ప్రారంభమయ్యేలా టెక్నాలజీ రూపొందించారు. క్లాస్ జరుగుతున్నప్పుడు ఎవరైనా విద్యార్థి మాట్లాడితే.. ఆ విద్యార్థి ఫొటో అందరికీ కనిపించేలా బోర్డుపై ప్రత్యక్షమవ్వడంతో పాటు వారి మాటలు కూడా వినిపిస్తాయి.
- ప్రతీ ప్రొఫెసర్ చెప్పే పాఠం కూడా రికార్డవుతుంది. ఈ రికార్డు చేసిన పాఠాలను ఐఐఎం వెబ్‌సైట్‌లో విద్యార్థుల కోసం రెండు వారాల పాటు నిక్షిప్తం చేస్తారు. ఎవరికి ఎలాంటి సందేహం ఉన్నా.. ఈ వీడియో చూసి తెలుసుకోవచ్చు.
- విద్యార్థులకు సంబంధించిన హాస్టళ్లలోని ప్రతి రూమ్‌లోనూ ఏసీ, టీవీ, ఫ్రిజ్, ఒవెన్, కెటిల్, వాషింగ్ మిషన్ ఏర్పాటు చేశారు.
- రోజుకు 216 కిలోలీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, 150 కిలోలీటర్ల సామర్థ్యంతో మురుగు నీటి నిర్వహణ ప్లాంట్ నిర్మించారు.
- విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఫిఫా సైజ్ ఫుట్‌బాల్ గ్రౌండ్, గ్రీన్ క్రికెట్ ఫీల్డ్, ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్ ఫెసిలిటీ, జిమ్, యోగా, మెడిటేషన్ సెంటర్లు సిద్ధం చేశారు.



గ్రీన్‌ఫీల్డ్ క్రికెట్ మైదానం

మిలాన్-24కు పటిష్ట భద్రత

- 3,536 మందితో 18 సెక్టార్లుగా బందోబస్తు
- సందర్శనకు వచ్చే ప్రజల కోసం 4 పార్కింగ్ స్థలాలు
- ఈనెల 22 వరకు బీచ్ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు



మాట్లాడుతున్న జాయింట్ సీపీ ఫకీరప్ప

విశాఖ సిటీ: మిలాన్-2024కు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జాయింట్ పోలీస్ కమిషనర్ కె.ఫకీరప్ప చెప్పారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ వరకు జరగనున్న మిలాన్ 12వ ఎడిషన్‌లో 56 దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. 20వ తేదీన ఫుల్ డ్రెస్ రిహార్సల్స్, 21న ప్రముఖుల రాకపోకలు, 22న ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. ఉపరాష్ట్రపతి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి, రాష్ట్ర గవర్నర్, భారత నావికాదళపతి మిలాన్ విన్యాసాలను తిలకించడానికి వస్తున్నట్లు వెల్లడించారు. మిలాన్ నిర్వహణ, ప్రముఖుల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం 3,536 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఏడుగురు ఐపీఎస్ అధికారులు, డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు ఇలా ఉన్నతాధికారులతో 18 సెక్టార్లుగా విభజించి బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వీవీఐపీలతో పాటు మిలాన్ సందర్శనకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ నెల 22వ తేదీ వరకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 8 వరకు నేవల్ కోస్టల్ బ్యాటరీ నుంచి పార్క్‌హోటల్ వరకు వాహనాల రాకపోకలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు, పార్కింగ్ ఏర్పాట్లను వివరించారు.

నేవల్ పాసులు ఉన్న వారు

- నేవీ వెహికల్ పాసులు ఉన్న వారు తమ వాహనాలను సీఆర్‌రెడ్డి, ఆల్ ఇండియా రేడియో జంక్షన్ మీదుగా ఏపీఐఐసీ గ్రౌండ్‌లో నిలపాలి. అక్కడి నుంచి విశ్వప్రియ ఫంక్షన్ హాల్ మీదుగా బీచ్ రోడ్డులోకి వచ్చి కేటాయించిన ఎన్‌క్లోజర్ ద్వారా వెళ్లాలి.
- నేవల్ పాసులు ఉన్న వాహనదారులు సీఆర్ రెడ్డి సర్కిల్, ఏయూ అవుట్ గేట్ మీదుగా ఏయూ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో పార్క్ చేసుకోవాలి. అక్కడి నుంచి ఏయూ ఇంగ్లిష్ మీడియం స్కూల్ రోడ్డు లేదా పార్క్ హోటల్ మీదుగా బీచ్ రోడ్డులోకి రావాలి.

సాధారణ వాహనదారులు

- సాధారణ, పాసులు లేని వాహనదారులకు నాలుగు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు.
- రుషికొండ, ఎంవీపీ నుంచి బీచ్ రోడ్డులో వచ్చే వారు పార్క్ హోటల్ పక్కన ఉన్న ఎంజీఎం గ్రౌండ్‌లో వాహనాలు నిలపాలి.
- పార్క్ హోటల్ నుంచి ఎటువంటి వాహనాలు బీచ్ రోడ్డులోకి అనుమతించరు.
- ఆర్టీసీ కాంప్లెక్స్, జగదాంబ జంక్షన్, సెవెన్ హిల్స్ హాస్పిటల్, కేజీహెచ్ వైపు నుంచి వచ్చే సాధారణ వాహనదారులు జిల్లా పరిషత్ ప్రాంగణంలో గానీ, ఏఎంసీ గ్రౌండ్‌లో గానీ, జూబ్లీ గ్రౌండ్(ద్విచక్ర వాహనాలు మాత్రమే)లో గాని పార్క్ చేసుకోవాలి. అక్కడి నుంచి కోస్టల్ బ్యాటరీ జంక్షన్ మీదుగా గోకుల్‌పార్క్ ద్వారా ఎన్‌క్లోజర్‌లోకి ప్రవేశించాలి.
- నేవల్ కోస్టల్ బ్యాటరీ లేదా నోవోటెల్ నుంచి ఆర్‌కే బీచ్‌లోకి ఎవరినీ అనుమతించరు. • నేవల్ కోస్టల్ బ్యాటరీ నుంచి పార్క్ హోటల్ వరకు బీచ్‌రోడ్డులో నివసించే వారు అత్యవసరమైతే వారి ఆధార్ కార్డును చూపిస్తే సందర్భాన్ని బట్టి అనుమతిస్తారు.

ట్రాఫిక్ మళ్లింపు

- రుషికొండ, ఎంవీపీ, కురుపాం సర్కిల్ నుంచి బీచ్‌లో ప్రయాణించే అంబులెన్సులు పార్క్ హోటల్ నుంచి చినవాల్తేరు మీదుగా సిరిపురం చేరుకొని సంబంధిత ఆస్పత్రులకు వెళ్లాలి.
- ఈ నెల 21, 22వ తేదీల్లో ప్రముఖులు విశాఖకు వస్తున్న నేపథ్యంలో భారీ వాహనాలు ఉదయం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్, కాన్వెంట్ జంక్షన్ నుంచి సింధియా వైపు రాకపోకలను నిషేధించారు.
- టూ, ఫోర్ వీలర్స్ ఉదయం 10 నుంచి రాత్రి 9 వరకు కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్ వైపు రాకపోకలు సాగించే వాహనదారులు కాన్వెంట్ జంక్షన్ నుంచి ఊర్వశి, ఎన్ఏడీ ద్వారా ప్రయాణించాలి.
- కాన్వెంట్ జంక్షన్, జీసీబీ గేట్, కంటైనర్ యార్డ్ వైపు భారీ వాహనాల రాకపోకలు నిషేధించారు.

డీసీపీ-1 మణికంఠ, ఏడీసీపీ(ట్రాఫిక్) శ్రీనివాసరావు, ఏసీపీ(ట్రాఫిక్) రాజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

గంటా ఉన్నా లేకున్నా నేనుంటా..

- లోకేష్ సభలో భరత్ వ్యాఖ్యలు
- గంటాకు తీవ్ర అవమానం



సాక్షి, విశాఖపట్నం : ఎన్నికల సంచార జీవిగా మారిన గంటా శ్రీనివాసరావు వైఖరిపై ఆ పార్టీ నేతలే బహిరంగ విమర్శలు గుప్పిస్తున్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఆ నియోజక వర్గ ప్రజలకు ఒక్కసారైనా మొహం చూపించని గంటా తీరుని నారా లోకేష్ ఎదురుగానే ఎండగడుతున్నారు. విశాఖ పర్యటనలో భాగంగా శంఖారావం సభ సాక్షిగా గంటా శ్రీనివాసరావుకు తీవ్ర అవమానం ఎదురైంది. టీడీపీ నాయకుడు నారా లోకేష్ విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని బిర్లా జంక్షన్ వద్ద సోమవారం నిర్వహించిన శంఖారావం సభలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సభలో టీడీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి, లోకేష్ తోడల్లుడు భరత్.. గంటాపై ప్రత్యక్షంగానే విమర్శలు గుప్పించారు. ఇక్కడ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మీకు అందుబాటులో లేకపోయినా తాము అండగా ఉంటామని చెప్పారు. ప్రజల సమస్యలను తీరుస్తామంటూ వేదికపైనే గంటా సమక్షంలోనే వ్యాఖ్యలు చేశారు. దీంతో గంటా తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. వేదికపై ఉన్న నేతలతో పాటు కార్యకర్తలు సైతం భరత్ వ్యాఖ్యలపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఉత్తర నియోజకవర్గ పార్టీ నేతలు కార్యకర్తలు మాత్రం భరత్ వ్యాఖ్యలు సమంజసమైనవేనని సభ ముగిసిన తర్వాత చర్చించుకున్నారు. ఎందుకంటే ఉత్తర ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి గంటా నియోజక వర్గ ప్రజలకు ముఖం చూపించినా పాపానపోలేదు. కనీసం కార్యకర్తలను కూడా కలిసిన సందర్భం లేదు. దీంతో క్యాడర్‌లో గంటాపై పూర్తిగా విశ్వాసం పోయింది. మరోవైపు ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జిగా తమకు బాధ్యతలు అప్పగించాలంటూ ఆదివారం సాయంత్రం టీడీపీ రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత స్వయంగా గంటాకే వినతిపత్రం అందించారు. ఈ వ్యవహారం కూడా పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

లోకేష్.. ఉత్తర అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు సవాల్



సీతమ్మధార: విశాఖ ఉత్తర నియోజకవర్గంలో నారా లోకేష్ నిర్వహించిన సభ స్తబ్దుగా, శబ్దం లేని శంఖారావంగా సాగిందని వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఎద్దేవా చేశారు. రాష్ట్రస్థాయి నాయకుడిగా చెప్పుకునే టీడీపీ అక్రమ వారసుడు లోకేష్ నిర్వహించిన సభకు కనీసం రెండు వేల మంది కూడా హాజరు కాలేదని, దీని ద్వారా ప్రజలకు ఆ పార్టీపై ఉన్న నమ్మకం ఏమిటో అర్థమవుతుందన్నారు. కనీసం స్వాగత ఏర్పాట్లు కూడా చేయలేని పార్టీ క్యాడర్.. ప్రజల్లోకి ఎలా వెళ్లగలదని విమర్శించారు. ఉత్తర నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై నారా లోకేష్ బహిరంగచర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. టీడీపీ నాయకుడు గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును పంపిస్తే నియోజకవర్గంలో తాము చేసిన అభివృద్ధిని దగ్గరుండి చూపిస్తానన్నారు.

కేజీహెచ్‌లో మరో ఐసీయూ పిల్లల వార్డు

పనులను పరిశీలించిన కలెక్టర్ మల్లికార్జున



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: కేజీహెచ్‌లో ఆధునిక వసతులతో మరో ఐసీయూ పిల్లల వార్డును అందుబాటులోకి తీసుకొచ్చేందుకు యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇప్పటికే అక్కడ వార్డు కన్వర్షన్ పనులు చేపట్టింది. ఆయా పనులను పరిశీలించేందుకు సోమవారం కేజీహెచ్ పిల్లల వార్డుకు వెళ్లిన కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులు పలు మార్గదర్శకాలు జారీ చేశారు. నవజాత శిశు అత్యవసర వైద్య విభాగంలో చేపట్టిన పునఃనిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ఆధునిక మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. కేజీహెచ్‌లో చేపడుతున్న నవజాత శిశు అత్యవసర వైద్య విభాగం పునఃనిర్మాణ పనులు, పిల్లల వార్డు, పరిసర ప్రాంతాలతో పాటు తాగునీరు తదితర ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. నవజాత శిశు అత్యవసర వైద్య విభాగం వార్డును ఐసీయూ వార్డుగా కన్వర్షన్ చేయటంలో భాగంగా చేపడుతున్న నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా పనులు చేపట్టాలన్నారు. ఈ వార్డుతో పాటు పిల్లల వార్డుకు అవసరమైన అన్ని వైద్య పరికరాలను సిద్ధం చేయాలని, అవసరమైతే మరిన్ని నిధులను వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

చిన్నారికి అవసరమైన వైద్యాన్ని అందిస్తాం

కేజీహెచ్ సందర్శనలో భాగంగా రోగులతో కలెక్టర్ మల్లికార్జున మాట్లాడారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్యం, వసతులపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చింతపల్లి మండలం లంబసింగికి చెందిన మారిన సత్యవతి తన ఏడాది కుమార్తె అయిన గౌరీశ్రీకి పుట్టుకతోనే కాళ్లు, చేతులు లేవని తన బిడ్డను ఆదుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన చిన్నారికి అవసరమైన పూర్తి వైద్యాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. సూపరింటెండెంట్ అశోక్ కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, ఏపీఎంఎస్ ఐడీసీ ఈఈ డీఏ నాయుడు, ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీతులసీ, పలు విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

శబ్దం లేని శంఖారావం

- చప్పగా సాగిన లోకేష్ శంఖారావం
- బౌన్సర్ల ఓవరాక్షన్‌తో ఆ పార్టీ నేతల అసహనం
- వేదిక వద్ద కనిపించని పవన్ ఫ్లెక్సీలు



ఖాళీగా దర్శన మిచ్చిన కుర్చీలు



కార్పొరేటర్ లక్ష్మీబాయిని వేదిక వద్దకు వెళ్లకుండా అడ్డుకున్న లోకేష్ సహాయకుడు

గాజువాక/మర్రిపాలెం: విశాఖ జిల్లాలో నారా లోకేష్ శంఖారావం చప్పగా సాగింది. ఆయన సభలకు ప్రజల నుంచి కనీస స్పందన రాలేదు. పార్టీ స్థానిక నాయకుల నుంచి కూడా ఆయనకు కనీస స్వాగతం దక్కని దుస్థితి నెలకొంది. సభ జరిగే ప్రాంతం మినహాయించి ఎక్కడా హడావిడే లేదు. ఫ్లెక్సీలు, జెండాలు కూడా ఎక్కడా కనిపించలేదు.

సోమవారం గాజువాకలో జరిగే శంఖారావం సభలో లోకేష్ వలంటీర్లు ఓవరాక్షన్ చేయడంతో ఆ పార్టీ నేతలు ఇబ్బంది పడ్డారు. 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి సభా వేదికపైకి వెళ్తుండగా వలంటీర్లు అడ్డుకున్నారు. లోకేష్ ప్రసంగిస్తుండగా వీడియో తీస్తున్న జర్నలిస్టులకు వలంటీర్లు అడ్డు తగిలారు. ఎలాంటి వీడియోలు తీయొద్దని వాగ్వాదానికి దిగారు. సభలో మాట్లాడినంత సేపు మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జనసేన నాయకుడు కోన తాతారావు తత్తరపాటుకు గురయ్యారు. లోకేష్ తన ప్రసంగంలో చేసిన కొన్ని వ్యాఖ్యలు సీనియర్లను అసంతృప్తికి గురి చేశాయి. ఇప్పటి నుంచి పనిచేసేవారినే తాను గుర్తు పెట్టుకుంటానని చెప్పడం చర్చనీయాంశమైంది. ఇన్నాళ్లు జెండాను భుజాన మోసినవారి పరిస్థితి ఏమిటంటూ గుసగుసలు వినిపించాయి. శంఖారావం సభకు ఆశించిన స్థాయిలో జనం రాకపోవడంతో టీడీపీ నాయకులు కంగుతిన్నారు.

– ఉత్తర నియోజకవర్గం బిర్లా జంక్షన్ వద్ద నిర్వహించిన శంఖారావం సభ ప్రారంభం కాక ముందే పలువురు నాయకులకు చేదు అనుభవం ఎదురైంది. లోపలకు ప్రవేశించే సమయంలో నాయకులు, బౌన్సర్ల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో అసహనం వ్యక్తం చేసిన టీడీపీ వార్డు నాయకులు కార్యక్రమాన్ని వీక్షించకుండా వెనుతిరిగారు. జనసేన పొత్తును బయటవరకే పరిమితం చేశారు. ప్రాంగణం బయట ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినప్పటికీ.. లోపల ఎక్కడా జనసేన అధినేత పవన్ ఫ్లెక్సీల ఊసే లేదు.

'స్పందన' వినతులకు సకాలంలో పరిష్కారం

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన)కు 88 వినతులు అందాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో కమిషనర్ సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఫిర్యాదులు స్వీకరించారు. వీటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, ప్రధాన సిటీ ప్లానర్ సురేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, కార్యదర్శి నల్లనయ్య పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 42 ఫిర్యాదులు

విశాఖ సిటీ: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 42 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్న ఏడీసీపీ వాటిపై సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడారు. వాటిపై చట్టప్రకారం చర్యలు తీసుకొని ఫిర్యాదులను పరిష్కరించాలని అధికారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

• విన్యాసం.. సంభ్రమాశ్చర్యం

నేడు ఫైనల్ రిహార్సల్స్

బీచ్‌రోడ్డు: మిలాన్–2024లో భాగంగా సోమవారం జరిగిన నేవీ విన్యాసాల ప్రదర్శన, పరేడ్ రిహార్సల్స్ అదరహో అనిపించాయి. దేశ రక్షణ కోసం నేవీ చేపట్టే ఆపరేషన్లను కమాండోలు కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శించారు. ఉగ్రవాదులను తరిమికొట్టడం, ఆపదలో చిక్కుకున్న వారిని రక్షించడం వంటి ఆపరేషన్లు ఉత్కంఠగా సాగాయి. కమాండోలు హెలికాప్టర్ నుంచి పారాచూట్ సాయంతో కిందకు దిగి అబ్బురపరిచారు. మిగ్ 29 కె, హాక్స్, ఫైటర్ జెట్స్, యుద్ధ విమానాలు, చేతక్‌లు, హెలికాప్టర్లను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. అనంతరం దేశ, రాష్ట్ర రక్షణ బలగాలు పరేడ్ రిహార్సల్స్ చేపట్టాయి. మంగళవారం ఫైనల్ రిహార్సల్స్ జరగనుండగా.. విన్యాసాలను వీక్షించేందుకు నేవీ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, పలు దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు.


తీరంలో బాంబుల మోత




బాంబులను జారవిడుస్తూ.., ఆకాశంలో అద్భుత విన్యాసం, హెలికాప్టర్ నుంచి దిగుతున్న కమాండోలు



దూసుకుపోతున్న మిగ్ విమానాలు

• ఇదీ.. నౌకాదళ 'సూర్య' ప్రతాపం

నింగీ నేలా ఏకం చేసేలా భారత నౌకాదళం సత్తా చాటుతోంది. భారత్, మిత్రదేశాలతో కలిసి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిలాన్–2024లో.. ప్రపంచానికి నౌకాదళ శౌర ప్రతాపాన్ని మరోసారి ప్రదర్శించనుంది. ఇందులో భాగంగా.. ఆర్‌కే బీచ్‌లో జరుగుతున్న రిహార్సల్స్‌లో నేవీలో కొత్తగా చేరిన సీహాక్స్ హెలికాప్టర్.. ఇలా సూర్యున్ని చీల్చుకుంటూ దూసుకుపోతూ.. అబ్బురపరిచింది.

ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్



భారతీయ కరెన్సీ కోసం..

బీచ్‌రోడ్డు: మిలాన్–24లో 50 దేశాలకు చెందినవారు పాల్గొంటున్నారు. సోమవారం విదేశీయులంతా ఆర్కే బీచ్ వేదికగా జరిగిన నేవీ విన్యాసాల రిహార్సల్స్ వీక్షించేందుకు తరలి వచ్చారు. అనంతరం భారతీయ కరెన్సీ కోసం బీచ్‌రోడ్డులోని ఇండియా ఒన్ ఏటీఎం వద్ద ఇలా క్యూ కట్టారు.



ఇండియా వన్ ఏటీఎం వద్ద క్యూ కట్టిన విదేశీయులు

పటిష్టంగా విశాఖ మ్యూజియం నిర్వహణ

కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: విశాఖ మ్యూజియం నిర్వహణ పటిష్టంగా చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలసి సోమవారం విశాఖ మ్యూజియంను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మిలాన్–2024కు వివిధ దేశాల ప్రతినిధులు విశాఖ విచ్చేస్తున్నారని, వారి సందర్శనార్థమై మ్యూజియంను ఆధునీకీకరించినట్లు చెప్పారు. అనంతరం మరమ్మతులు చేపట్టిన మారీటైమ్, హెరిటేజ్ మ్యూజియంను పరిశీలించారు. మ్యూజియంలో మంచి చిత్రాలు ఏర్పాటు చేయాలని అదనపు కమిషనర్‌కు కమిషనర్ సూచించారు. పురాతన విగ్రహాలు మరింత అందంగా కనిపించేందుకు ఫోక్ లైట్లను ఏర్పాటు చేయాలని పర్యవేక్షక ఇంజనీర్ సత్యనారాయణ రాజును, మ్యూజియం ఆవరణలో మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దాలని డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ దామోదర్‌ను, పురాతన వస్తువులు, విలువైన వస్తువులను నిత్యం గమనిస్తూ.. భద్రతా చర్యలు చేపట్టాలని క్యూరేటర్ రమణను ఆదేశించారు. అనంతరం పాండురంగాపురం సమీపం ఆఫీసర్స్ క్లబ్ పక్కన నిర్మాణంలో ఉన్న జీవీఎంసీ గెస్ట్‌హౌస్‌ను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీర్‌ను ఆదేశించారు. ఈఈ రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

50 ఏళ్ల స్ఫూర్తిదాయక ప్రయాణం


వెంకయ్యనాయుడుకి జ్ఞాపిక అందిస్తున్న ఫాదర్


భరతనాట్యం చేస్తున్న విద్యార్థులు

- ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ సేవలను కొనియాడిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- ముగిసిన స్వర్ణోత్సవాలు

సీతమ్మధార: మన భవిష్యత్‌కు పునాదులు వేసిన వారిని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. సీతమ్మధారలోని ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ స్వర్ణోత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిసాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయనకు ప్రిన్సిపాల్ ఫాదర్ మనోజ్, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ ఓ సంస్థ స్వర్ణోత్సవాలు జరుపుకోవడం అంత తేలికైన విషయం కాదన్నారు. సంస్థ వ్యవస్థాపకుల్లో నిబద్ధత, అకుంఠిత దీక్ష, కార్య దక్షతతోనే ఇంతటి ప్రస్థానం సాధ్యమవుతుందన్నారు. ఈ పాఠశాలలో చదివిన ఎంతో మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని, వారిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కోస్తా జిల్లాల్లో బలహీన వర్గాల వారికి మిషనరీ పాఠశాలలు అంకితభావంతో విద్యను అందుబాటులోకి తీసుకొచ్చాయని కొనియాడారు. పాఠశాలలో భారతీయ సంస్కృతి పట్ల అవగాహన కల్పిస్తూ పండగలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. నాణ్యమైన పనితీరును కొనసాగిస్తూ.. సంస్థ దీర్ఘకాలం మనుగడ సాగించాలని ఆకాంక్షించారు. స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని సాగిస్తున్న పాఠశాల యాజమాన్యానికి, చేదోడువాదోడుగా ఉంటున్న సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ కె.వి.జోషెఫ్, సీబీఎస్‌ఈ స్కూల్ ప్రిన్సిపాల్ పి.విజయ్ పాల్గొన్నారు.

శారదా సన్నిధిలో ఆధ్యాత్మిక పరవశం

ఘనంగా ముగిసిన శ్రీశారదాపీఠం వార్షికోత్సవాలు

పెందుర్తి: శ్రీశారదాపీఠం వార్షికోత్సవాలు వైభవంగా ముగిశాయి. హోమాలు, కల్యాణాలు, పారాయన మహాయజ్ఞాల నడుమ శాస్త్రోక్తంగా సాగిన క్రతువు విశేషంగా ముగిసింది. ఆఖరిరోజు మహిషాసుర మర్దిని అవతారంలో రాజశ్యామల అమ్మవారిని అలంకరించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీలు అమ్మవారికి విశేష పూజలు జరిపారు. తొలుత వార్షిక హోమాలకు స్వయం జ్యోతి మండపంలో పూర్ణాహుతిలో నిర్వహించారు. అనంతరం యాగాశాలలో మహారుద్ర సహిత రాజశ్యామల యాగానికి మహా పూర్ణాహుతి చేశారు. ప్రవచన కర్త విభీషణ శర్మకు ప్రవచన విశారద బిరుదును ప్రదానం చేశారు. పండిత ప్రముఖులు ముష్టి భీమశంకరశాస్త్రి, ముష్టి పురుషోత్తమశర్మ, ముక్కామల సుబ్రహ్మణ్యేశ్వరశర్మ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును స్వామీజీ సత్కరించారు. ఆఖరి రోజు ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు పీఠం ప్రతినిధులు ప్రసాద వితరణ చేపట్టారు.


ప్రవచన కర్త విభీషణ శర్మకు ప్రవచన విశారద బిరుదు ప్రదానం చేస్తున్న స్వామీజీలు

ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన అవసరం

ఏయూక్యాంపస్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, దీనికి శిక్షణ తరగతులు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తాయని కలెక్టర్ మల్లికార్జున అన్నారు. లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గాల ఏఆర్‌వోల రెండో విడత శిక్షణ కార్యక్రమాలను సోమవారం ఏయూ ఇంజనీరింగ్ కళాశాల కెమికల్ ఇంజనీరింగ్ విభాగం సమావేశ మందిరంలో నిర్వహించారు. జాతీయ స్థాయి మాస్టర్ ట్రైనీలు ఎస్.కె.సేథియా, డాక్టర్ మహమ్మద్ రెహాన్ రాజా, అతీక్ అహ్మద్‌లతో కలసి జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి మొదటి విడత ఐదు రోజుల శిక్షణ పూర్తిచేశామని, తద్వారా ఏఆర్‌వోలు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారన్నారు. డీఆర్వో కె.మోహన్‌కుమార్, విశాఖ, విజయనగరం, అనకాపల్లి, పాడేరు, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల జేసీలు, ఏఆర్‌వోలు హాజరయ్యారు.

ఎన్నికల విధుల్లో మినహాయింపులుండవు

- నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి సెలవుల రద్దు
- కలెక్టర్ మల్లికార్జున వెల్లడి

మహారాణిపేట: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి అధికారి విధులు నిర్వహించాల్సి ఉంటుందని, ఇందులో ఎటువంటి మినహాయింపులు ఉండబోవని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. త్వరలో జరగనున్న ఎన్నికల కోసం ఇప్పటికే నోడల్ అధికారులను నియమించినట్లు చెప్పారు. ఆయా నోడల్ అధికారులు వారి విధులు, బాధ్యతలను గుర్తెరిగి పనిచేయాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి ఉద్యోగులకు సెలవులు ఉండవని స్పష్టం చేశారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లా అధికారులతో పాటు ఆయా శాఖల సిబ్బందిని కూడా వినియోగించుకోనున్నట్లు చెప్పారు. కొన్ని శాఖల అధికారులు, సిబ్బందికి ఎన్నికల నుంచి మినహాయింపు ఉన్నప్పటికీ వారు కూడా ఎన్నికల విధుల్లో భాగమేనని గుర్తించాలన్నారు. ఎన్నికల విధుల్లో హాజరుకానట్లు రుజువైతే సంబంధిత శాఖాధికారే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, డీఎల్‌డీవో ఆర్. పూర్ణిమాదేవి, పోలీస్, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

హెచ్‌వోడీలు హాజరు కావాల్సిందే..

స్పందనకు దిగువస్థాయి సిబ్బందిని పంపడంపై కలెక్టర్ ఆగ్రహం

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమానికి హెచ్‌వోడీలు తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున స్పష్టం చేశారు. ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరైనా.. దిగువ స్థాయి సిబ్బందిని పంపినా సంబంధిత శాఖాధిపతులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో సోమవారం జరిగిన స్పందనలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 140 అర్జీలు అందగా.. ఇందులో 67 జీవీఎంసీ, 17 పోలీస్ శాఖ, 56 వినతులు ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన వినతులను నిబద్ధతతో పనిచేసి పరిష్కరించాలన్నారు. పెండింగ్ అర్జీలపై దృష్టి సారించాలని ఆదేశించారు. అర్జీలు రీఓపెన్ అవుతున్నాయని.. అటువంటి వాటిపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కాగా.. స్పందనకు కొందరు హెచ్‌వోడీలు హాజరుకాకుండా.. దిగువస్థాయి సిబ్బందిని పంపడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితులు, ఇతర పర్యటనల సమయాల్లో ముందస్తు అనుమతితో మాత్రమే శాఖాధిపతులకు మినహాయింపు ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. డీఆర్వో కె.మోహన్‌కుమార్, డీఎల్‌డీవో ఆర్.పూర్ణిమాదేవి పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, డీఆర్వో మోహన్‌కుమార్

ధ్రువపత్రాలు సకాలంలో జారీ చేయండి

సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

డాబాగార్డెన్స్: జనన, మరణ, వివాహ ధ్రువపత్రాలు సకాలంలో జారీ చేయాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ అధికారులకు సూచించారు. విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జోన్–4లో ఆయా ధ్రువపత్రాల జారీపై జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, స్టాటిస్టికల్ ఆఫీసర్ పీడీవీ ప్రసాదరావు, పంచాయతీ ఆఫీసర్ ఎం.వి.ఎస్.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనన మరణ ధ్రువపత్రాలు నిర్ణీత సమయానికి అందించాలన్నారు. ఏ ఏ సర్టిఫికెట్‌కు ఎంత రుసుం చెల్లించాలి? ఎన్ని రోజుల్లో అందించాలన్న విషయమై ఆరా తీశారు. ముఖ్యంగా సిటిజన్ చార్ట్ ప్రకారం ఎవరికీ ఎటువంటి నష్టం వాటిల్లకుండా ధ్రువపత్రాలు అందించాలన్నారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలోని 8 జోన్లలో జోన్ల కమిషనర్లు, ఏఎంవోహెచ్‌ల ద్వారా ధ్రువపత్రాలు రిజిస్ట్రేషన్ చేసి అందించడం జరుగుతుందన్నారు. ధ్రువపత్రాల్లో సవరణలు సాంకేతికంగా ఉన్న వాటిని స్టాటిస్టికల్ అధికారి ద్వారా సరైన పత్రాలు అందజేసినచో పరిష్కరిస్తామన్నారు. అనంతరం డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, పంచాయతీ ఆఫీసర్ వివాహ ధ్రువపత్రాలు అందించే విధివిధానాలు వివరించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు, ఏఎంఓహెచ్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

సుజుకి లక్కీ డ్రా విజేతలకు బహుమతుల ప్రదానం

సీతమ్మధార: సుజుకి టూ వీలర్స్ అగ్రశ్రేణి డీలర్ పద్మజ సుజుకి దసరా, దీపావళి పండగుల సందర్భంగా తమ బైక్‌లను కొనుగోలు చేసిన కస్టమర్లకు లక్కీ డ్రా నిర్వహించింది. ఈ లక్కీ డ్రాలో ఐదుగురు కస్టమర్లు విజేతలుగా నిలిచారు. ఇద్దరు రూ.84 వేలు విలువ గల ఐఫోన్‌లు, ఒకరు రూ.35 వేలు విలువల గల గోల్డ్, ఇద్దరు హోమ్ థియేటర్ గెలుపొందారు. వీరందరికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ షేక్ రఫీ, సుజుకి మోటార్స్ ఇండియా లిమిటెడ్ సేల్స్ ఏరియా మేనేజర్ వంశీ, సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న ఈడీ వినోద్‌కుమార్

పీతల మూర్తీ.. నీకిది తగునా?

- పిఠాపురంకాలనీలో వారంతపు సంత తొలగించిన జనసేన కార్పొరేటర్
- నిరసన వ్యక్తం చేసిన చిరు వ్యాపారులు

బీచ్‌రోడ్డు: ఎన్నో ఏళ్లుగా వారాంతపు సంతపై ఆధారపడి జీవనం సాగిస్తున్న 300 కుటుంబాలకు ఆ ప్రాంత జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఇబ్బందులకు గురి చేశాడు. పిఠాపురంకాలనీలో సోమవారం జరిగిన వారంతపు సంతలో చిరువ్యాపారుల దుకాణాలను తొలగించేందుకు తన అనుచరులతో రంగంలోకి దిగాడు. కొందరి సామాన్లను ఆటోల్లో ఎక్కించుకుని తీసుకెళ్లడంతో వారంతా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి వి.కృష్ణారావు మాట్లాడుతూ ప్రజలకు అండగా ఉండాల్సిన ఓ కార్పొరేటర్.. చిల్లర వర్తకులకు జీవనోపాధి లేకుండా చేయడం తగదన్నారు. ముందస్తు సమాచారం లేకుండా.. ప్రత్యామ్నాయం చూపకుండా తొలగించడంపై వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు.


రోడ్డు మీద నిరసన వ్యక్తం చేస్తున్న చిరు వ్యాపారులు

మహారాజా బ్యాంక్ నూతన శాఖ ప్రారంభం

కూర్మన్నపాలెం: మహారాజా కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ 8వ శాఖ కూర్మన్నపాలెంలో ప్రారంభమైంది. కేంద్ర మాజీ పౌర విమానయానశాఖ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సోమవారం ఈ శాఖను ప్రారంభించారు. కూర్మన్నపాలెం, దువ్వాడ, రాజీవ్‌కాలనీ, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, సామాన్య ప్రజలందరికీ బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కూర్మన్నపాలెంలో నూతన శాఖను ప్రారంభించినట్లు బ్యాంకు యాజమాన్య ప్రతినిధులు వెల్లడించారు. లాకర్ సదుపాయంతో పాటు మొబైల్ బ్యాంకింగ్, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు మొదలైన సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. త్వరలోఅనకాపల్లి, తునిలో కొత్త శాఖలు ప్రారంభించేందుకు ఆర్బీఐ అనుమతి పొందామన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఈడీ సి.ఎస్.ఎన్.రాజు, వైజాగ్ ప్రొఫైల్ సంస్థ డైరెక్టర్ వీరమాచినేని వెంకట కృష్ణారావులను ఘనంగా సత్కరించారు. జిల్లా సహకార శాఖ అధికారి ప్రవీణ, ఎమ్మెల్సీ రఘువర్మ, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, పైడా విద్యా సంస్థల అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.


కూర్మన్నపాలెంలో బ్యాంక్ శాఖను ప్రారంభిస్తున్న అశోక్‌గజపతిరాజు